క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శిధర్‌రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి, మైసమ్మగూడ, మల్లారెడ్డి కళాశాలలు, ప్రీమియర్ ఎప్సిలన్, స్టెర్లింగ్ హోమ్స్, ఊర్జిత 1,2,3, ట్రిడెంట్ ప్రాపర్టీస్, లక్ష్మీనగర్, దూలపల్లి రోడ్, అపర్ణ, వెంచర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

22 నుంచి కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న విగ్రహ ఊరేగింపు, శోభా యాత్ర, 23న మహా గణపతి పూజ, అఖండ దీపారాదన, అంకురార్పణ, దీక్షాధారణ, 24న మండప పూజ, చండీ సప్తపతి హోమం, ప్రతిష్ఠా హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మెగా లోక్ అదాలత్

మేడ్చల్: మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులలో, లైసెన్స్‌లు లేని కేసుల్లో పట్టుబడ్డ వారి కోసం మేడ్చల్‌లో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ నర్సింహ రెడ్డి తెలిపారు. ఎలాంటి కౌన్సెలింగ్, జైలు శిక్షలు లేకుండా మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జరిమానాలు విధించి కేసులు కొట్టేస్తారని, మేడ్చల్ కోర్టులో ఉదయం 6 గంటలకు నిర్వహించే అదాలత్‌కు వాహనదారులు ఆర్‌సీ, లైసెన్స్, ఆధార్‌కార్డు, పాస్‌ఫోటో సైజ్ ఫోటోలతో హాజరుకావాలని కోరారు.

ఘట్‌కేసర్ ప్రీమియం లీగ్ షురూ..



క్రీడలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావనీ

పోచారం: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ప్రీమియం లీగ్ పోటీలు స్థానిక గురుకుల కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా చైర్‌పర్సన్ పావని జంగయ్య, స్థానిక కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్ పాల్గొని టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు ఆంజనేయులు, బేతాల నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు బర్ల హరిశంకర్, బండారు రాందాస్, పల్లె విజయ్ గౌడ్ పాల్గొన్నారు.

నోటీసులు అందిన వారు రుసుము చెల్లించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

శామీర్‌పేట్: జీఓ 59 డిమాండ్ నోటీసులు అందిన వారు రెండు వారాల్లో రుసుము చెల్లించాలని శామీర్‌పేట తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 59 జీఓ కింద క్రమబద్ధీకరణ స్కీంను తీసుకువచ్చిందని, ఈ మేరకు పై స్కీం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి డిమాండ్ నోటీసులు ఇప్పటి వరకు 142 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. నోటీసులు అందిన వారు కొత్త రిజిస్ట్రేషన్ చార్జీల ప్రకారం రెండు వారాల్లో డబ్బులు చెల్లించాలని, చెల్లించిన వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్

పోచారం: కొర్రెముల గ్రామానికి చెందిన ఉడుగుల యాదమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. అంత్యక్రియల కోసం సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్ గౌడ్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. యాదమ్మ మృతి పట్ల సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ రాజు, నాయకుడు సత్యనారాయణ సంతాపం తెలిపారు.

కండ్లకోయలో కంటి వెలుగు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మద్దుల లక్ష్మి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు పరిధి కండ్లకోయలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు గ్రామస్తులకు మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూల్చివేతలు మొక్కుబడిగానే..!

3 జీపీల్లో గోడౌన్, షెడ్లు కూల్చివేత, రోడ్లు ధ్వంసం.. వెంచర్ యజమానిపై కేసు

- అధికార పార్టీ పెద్దలు అడ్డు చెబుతున్నారని నాన్చుడు ధోరణి
- సర్కారు, అసైన్డ్ భూముల్లోనూ దర్జాగా అక్రమ నిర్మాణాలు
- ఆగని దందాతో ప్రజల్లో చర్చ





శామీర్‌పేట్, బాబాగూడ, లాల్‌గడ్ మలక్‌పేటలో మొక్కుబడి కూల్చివేసిన అక్రమ కట్టడాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న నాన్చుడు ధోరణి పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల్లో అక్రమంగా నిర్మించిన భవనాలు, లేఅవుట్లపై విజిలెన్సు శాఖ విచారణ నిర్వహించి ప్రాథమిక నివేదిక అందజేసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో పలువురు ఉన్నతాధికారుల తాత్సర్యంపై స్థానిక ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అక్రమార్కులపై లోతైన విచారణ చేపట్టి చర్యలకు ఉపక్రమించాల్సిన జిల్లా పంచాయతీ, పురపాలక శాఖలు చేతులుడిగిన తీరు.. ఆయా శాఖ వర్గాలనే తీవ్ర విస్మయానికి గురి చేస్తోంది. 'నవ్వి పోదురు గాక.. నాకేంటి సిగ్గు' అన్న చందంగా.. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై అధికార పార్టీ పెద్దలు అడ్డు చెబుతున్నారన్న నెపంతో సంబంధిత అధికారులు, పలువురు గ్రామ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

మొక్కుబడిగా...

స్థానిక సంస్థల్లోగుర్తించిన అక్రమ లేఅవుట్లు, కట్టడాలు అనేకం ఉన్నా.. కేవలం ఫిర్యాదులు వచ్చిన వాటిలో కొన్నింటిపైనే చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం శామీర్‌పేట పంచాయతీలోని సెలబ్రిటీ క్లబ్‌లో అక్రమ వెంచర్‌లో వేసిన రోడ్లు, షెడ్లు జీపీ సిబ్బంది ధ్వంసం చేశారు. బాబాగూడలో గోడౌన్స్, లాల్‌గడ్ మలక్‌పేట్‌లో రేకుల షెడ్డును కూడా కూల్చివేశారు. ఘట్కేసర్ మండలంలోని అవుషాపూర్‌లో 259 నుంచి 261, 263 నుంచి 268, 271 సర్వే నంబర్లలోని దాదాపు 35 ఎకరాల్లో రెండు ప్రధాన నాలాలను ఆక్రమించి వెంచర్ చేస్తున్న సదరు యజమానికి నోటీసులు ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న నాలాల ప్రాంతంలో వేసిన రోడ్లు, ప్రహరీలను కూల్చివేస్తామని ఇరిగేషన్, రెవెన్యూ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అడ్డుగా ఓ ప్రధాన ప్రజాప్రతినిధి...

అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అక్రమ భవనాలు, లేఅవుట్లను కూల్చివేయనీయకుండా అడ్డుపడుతున్నారని బదనాం చేసేందుకు.. వాటి జోలికి వెళ్లకుండా నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల మెప్పు కోసం కొన్ని గ్రామాలు, పురపాలికల్లో మొక్కుబడిగా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారని ఉద్యోగ వర్గాల్లోని గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులతో పురపాలక సంఘాలు, పంచాయతీ శాఖలోని కొందరు ఉద్యోగులు లోపాయికారి ఒప్పందంతో అక్రమ కట్టడాల జోలికి వెళ్లకుండా.. ఏదో ఒక మూలన ధ్వంసం చేసి సెలవు రోజుల్లో మళ్లీ నిర్మించుకునేలా అవకాశాన్ని కల్పిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రతి దానికో రేటు...

హైదరాబాద్ మహా నగరానికి కూత వేటు దూరంలో జీపీలు, పురపాలక సంఘాలు ఉండటంతో భూములు, ప్లాట్లు, ఇళ్ల ధరలు చుక్కలంటి కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో కొందరు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు భారీ వసూళ్లకు తెగుపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పర్వంలో ప్రతి దానికి ఒక రేటు విధించి బలవంతపు వసూళ్లకు తెర లేపిన తీరు జీపీ, పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. లేఅవుట్లు, వెంచర్లు, ఇండిపెండెంట్ ఇళ్లు నిర్మిస్తున్న వారి నుంచి ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయించి పలువురి ఉన్నతాధికారుల నుంచి మొదలు కొని సిబ్బంది వరకు భారీగా వసూళ్లకు పాల్పడి కొందరు ప్రజాప్రతినిధులకు పర్సంటేజీ రూపంలో పంపకాలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సర్కారు, అసైన్డ్ భూముల్లోనూ...

శివారుల్లోని ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూమి, చెరువు కుంటల బఫర్ జోన్, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై జిల్లా అధికార యంత్రాంగం ఉదాసీనత వైఖరి కూడా భూ కబ్జాదారులకు వరంగా మారుతోంది. జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, దమ్మాయిగూడ, తూముకుంట, పోచారం, గుండ్లపోచంపల్లి, నిజాంపేట, దుండిగల్, మేడ్చల్, ఘట్కేసర్ పురపాలికలతో పాటు కీసర, శామీర్‌పేట్ మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో ఏదో ఒక చోట అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండటంతో పలువురు ఉద్యోగులు, టౌన్‌ప్లానింగ్‌లోని కొందరు సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులకు వరంగా మారుతోంది. మున్సిపాలిటీల్లోని పార్కులు, నాలాలు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

గుర్తించిన అక్రమ కట్టడాలివే

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలికలు, జీపీల్లో గతంలో గుర్తించిన అక్రమ కట్టడాలు, లేఅవుట్లు 3,643 ఉన్నాయి. ఇవన్నీ ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులతో బయటపడ్డాయి. జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధుల్లోని పార్కులు, రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాల స్థలం, కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాల స్థలం, మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20 చదరపు గజాలు, కూకట్‌పల్లిలో 455 చదరపు గజాలు, కుత్బుల్లాపూర్‌లో 62 చదరపు గజాలు, గాజులరామారంలో 198 చదరపు గజాలు, అల్వాల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురైంది.

బీఆర్ఎస్ హయాంలోనే ముదిరాజ్‌లకు పెద్దపీట



నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జవహర్‌నగర్: అసెంబ్లీలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలను వ్యతిరేకిస్తూ జవహర్‌నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జవహర్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు అరకల అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ముదిరాజ్‌లకు పెద్దపీట వేసిందని, అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేణు, మురుగేష్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్, నాయకులు నాగులు, నర్సింగ్, కృష్ణ, పాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్లౌడ్ టెక్నాలజీ కార్యక్రమం



కార్యక్రమంలో విద్యార్థినులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో క్లౌడ్ టెక్నాలజీపై మహిళా వర్క్ ఫోర్స్ సాధికారతపై నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కళాశాల ఎడ్యు స్కిల్స్ అండ్ ఏడబ్ల్యూఎస్ సంయుక్తంగా మూడ్రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది విద్యార్థినులకు వర్క్‌ఫోర్స్, క్లౌడ్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని 5వేల మంది విద్యార్థినులకు క్లౌడ్ టెక్నాలజీ నైపుణ్యతను అందించడం, సాధికరత కలిపించడం కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, ఎడ్యు స్కిల్ బృంద సభ్యులు పవన్, బిబేక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమల్లో ఉద్యోగుల పాత్ర కీలకం



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా టీఎన్జీవోస్ 2023 డైరీ, కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, టీజీవోఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌మూర్తి, శామ్యూల్‌పాల్, హరి, భాస్కర్, ఈశ్వర్, మెదక్ అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నరసింహులు ఉన్నారు.

'రాష్ట్రంలో కుటుంబ పాలన అవినీతి పెచ్చుమీరింది'



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

శామీర్‌పేట్: రాష్ట్రంలో కుటుంబాల కొనసాగుతుండటంతో అవినీతి పెచ్చుమీరిందని, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పెత్తనం చెలాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లిలో శుక్రవారం 'ప్రజా గోస–బీజేపీ భరోసా' నిర్వహించారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం వేల కోట్ల అక్రమాలకు పాల్పడిందని, కాళేశ్వరం వివరాలు కేంద్రానికి ఇస్తే అవినీతి బయటపడుతుందన్నారు. ప్రజలకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకులు విక్కు నాయక్, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, విజయలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించడమే 'ఆత్మనిర్భర్' లక్ష్యం



న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయిర్ కమాండర్ పెమ్మరాజు మహేశ్వర్, యూనివర్సిటీ వీసీ

మేడ్చల్‌రూరల్: దేశం ఆర్థిక మాంద్యం నుంచి బయటపడి ఆర్థిక ప్రగతి సాధించాలంటే స్వావలంబనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, స్వావలంబన సాధించడమే ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యమని వాయుసేన మోడల్ గ్రహీత, ఎయిర్ కమాండర్ పెమ్మరాజు మహేశ్వర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో 'గ్లోబల్ ఎకానమిక్ సిట్యుయేషన్ విత్ స్పెసిఫిక్ రెఫరెన్స్ టూ మార్కెట్ ట్రెండ్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై రెండ్రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిర్ కమాండర్ విచ్చేసి మాట్లాడారు. అనంతరం యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పేపర్ ప్రజెంటేషన్స్ వచ్చాయని, ఉత్తమమైనవి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ ఆర్అండ్‌డీ డీన్ ప్రమోద్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హమార ప్రసాద్‌పై చర్యలు చేపట్టాలి



ధర్నాలో అంబేడ్కర్ సంఘం, బీఎస్పీ నేతలు

కీసర: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హింసాత్మకమైన వాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ అనే వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కీసర అంబేడ్కర్ సంఘం, బీఎస్పీ ఆధ్వర్యంలో కీసర చౌరస్తాలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బోడ జంగయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కీసర పోలీస్‌స్టేషన్‌లో అతడిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మొర్గు రవీందర్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, నాయకులు దాయర శ్రీనివాస్, గరుగుల మల్లేష్, బాలస్వామి, కర్ర గణేష్, తుడుం శ్రీనివాస్, చినింగని బాల్‌రాజ్, రవి, మహేష్, ప్రభాకర్, జగన్నాథ్, చంద్రమౌళి, రవి, రాహుల్, శ్రీను ఉన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీ, కౌన్సిలర్ శశికళ

పోచారం: ఘట్‌కేసర్‌లోని కరీంగూడ రోడ్డుకు గుంతలు పడటంతో చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, 10వ వార్డు కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్ సొంత నిధులతో శుక్రవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా పనులను వారు పర్యవేక్షించారు. గుంతల్లో మట్టి పోయించి చదును చేయించారు.

యువకుడి అదృశ్యం



రియాన్

జవహర్‌నగర్: స్నేహితుడి వద్దకు వెళ్లొస్తానని ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాజీనగర్ సిటీజన్ కాలనీలో నివసించే ఎండీ వసీమ్ కుమారుడు రియాన్(19) 8వ తరగతి వర కు చదువుకుని ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదీన రియాన్ సికింద్రాబాద్‌లోని తన స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రియాన్ ఆచూ కీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

శామీర్‌పేట్: అలియాబాద్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డికి చెందిన శ్రీకాంత్(19) యువకుడు మరో స్నేహితుడితో కలిసి శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని తమ బంధువుల వివాహానికి హాజరై తిరిగి ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో అలియాబాద్ చౌరస్తా వద్ద వీరిద్దరూ కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు శ్రీకాంత్ బస్సు వెనక చక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తన రెండు కాళ్లు విరిగిపోయాయి. కాగా ప్రమాదం జరిగిన ఘటనను కారు నిలిపి చూస్తున్న క్రమంలో వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా ధ్వంసమైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనలో మహేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శు క్రవారం ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశా రు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివా స్, కార్పొరేటర్లు నిహారిక, లావణ్యసతీష్‌గౌడ్, నాగరాజివెంకటేష్, లక్ష్మీకృష్ణగౌడ్, మేక లలితయాదవ్, గొడుగు వేణు, పానుగంటి బాబు, నాయకులు ప్రసాద్‌గౌడ్, రాజుగౌడ్, జవహర్‌నగర్ గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- 16 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు
- సౌకర్యాలపై సమీక్షలు నిర్వహిస్తూ పనుల్లో నిమగ్నం



కీసర జాతరకు.. పనులు చకచకా..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న రామలింగేశ్వరుడి ఆలయం

కీసర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం ముస్తాబవుతోంది. గుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర జరిగే ప్రాంతంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ ఏర్పాట్లకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. కరోనా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ సారి జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్న అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జాతర ఏర్పాట్లపై రెండు సార్లు మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పనులను వెంటనే ప్రారంభించి జాతర ప్రారంభమయ్యేలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించగా జాతర పనుల్లో వేగం పెరిగింది.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ఇలా...

- గుట్ట పరిసరాలతో పాటు ప్రధాన ఆలయం, ఆంజనేయ స్వామి విగ్రహానికి, మహా మండపంకు రంగులు వేసే పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. మరో పక్క హుడా పార్కు నుంచి ఉత్తర ద్వా రం గుండా స్వామి వారి దర్శనానికి క్యూలైన్లు, భక్తులు సేద తీరేందుకు ఆంజనేయ స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- విద్యుత్ అధికారులు కీసర నుంచి గుట్ట జాతర వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీకట్టింగ్ పూర్తి చేసి జాతర జరిగే ప్రాంతమంతా విద్యుత్ సరఫరాకు సంబంధించి పనులను ప్రారంభించారు.
- ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జాతర జరిగే ప్రాంతాల్లో నిరంతరాయంగా మంచినీటి సరఫరా కోసం పైప్‌లైన్లు, కులాయిలు, మినీ ట్యాంకుల వద్ద మరమ్మతులు, ఆన్, ఆఫ్‌లను బిగించే పనులు సోమవారం నుంచి ప్రారంభించనున్నారు.
- ఇక యాత్రికులు సేద తీరే దిగువ గుట్ట ప్రాంతం, ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద చదును, మరుగుదొడ్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాట్లకు సంబంధించి పనులు కూడా ప్రారంభమయ్యాయి.
- యాత్రికుల కోసం ప్రత్యేకంగా అందించే లడ్డూ, పులిహోరా, వడ తదితర ప్రసాదం పనులు కూడా ప్రారంభమయ్యాయి.
- కీసరగుట్ట జాతరకు సంబంధించిన సమాచారాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంతో పాటు జాతరలో తప్పిపోయిన వారి సమాచారం చేరవేసేందుకు కీసర వాణీని కూడా సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

200 వరకు ప్రత్యేక బస్సులు...

యాత్రికుల కోసం ఆర్టీసీ వారు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 వరకు బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం వెంకన్న తెలిపారు. ఇటీవల గుట్టలో గల ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన ఆయన డీవీఎం అపర్ణకల్యాణి, కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రకాంత్, హకీంపేట డిపో మేనేజర్ బహుబూతి, చెంగిచెర్ల డిపో మేనేజర్ యేసు, కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్‌లతో అక్కడ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు...

కీసరగుట్ట జాతర సందర్భంగా రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో సుమారు 1000 నుంచి 1500 మంది పోలీసులతో పటిష్టగ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఒకసారి సీపీ చౌహాన్ గుట్టలో పర్యటించి జాతర సందర్భంగా చేపట్టాల్సిన భద్రతతో పాటు వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పనులను అప్పగించారు.

యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



సామాన్య భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏరాట్లు చేశాం. భక్తులకు ఈ సారి ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా కొత్తగా వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. చంటి పిల్లలతో వచ్చే వారి కి, వద్దులకు స్వామి దర్శనం అతి త్వరగా జరిగేలా చర్యలు చేపట్టనున్నాం. ఇక గర్భాలయంలో కొలువుదీరిన స్వామివారిని ఒకేసారి నలుగురు దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేసి వీవీఐపీలకు స్వామి దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్‌ను ఏర్పాటు చేయడం, ప్రసాదాల కొరత రాకుండా అన్ని ఏర్పాట్లపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుంది.

– తటాకం రమేష్‌శర్మ, ఆలయ చైర్మన్





ప్రసాదాల తయారీని ప్రారంభిస్తున్న రమేష్ శర్మ

